# మరోస్వార్థం కథ

శంకరమంచిపార్థ సారథి

డాక్టర్ దయాసాగర్ఆ వూరొచ్చి ఎనిమిదేళ్ళయింది.

చదువు పూర్తికాగానే పట్టణాలు, నగరాల్లోని సాటి డాక్టర్ల ధాటిక తట్టుకలోఏక , వారితో పోటీపడలేక , గ్రామ ప్రజానీకానికి వైద్య సదుపాయం కలిగిస్తానన్న నినాదపు ముసుగులో ఆ వూరు చేరాడు.

అందకుముందు ఆ వూళ్ళో వైద్య సదుపాయ లేక పోవటంతో, జలుబు – జ్వరానికి కూడా పట్టణాలకెళ్ళలేక అక్కడి జనం విసుగెత్తిపోయారు.

అటువంటి పరిస్థితులలో ఆ వూరెళ్ళిన దయాసాగర్, వాళ్ళకి ఎంతో విలువైన మనిషిగా కన్పించాడు.

అందుకే అతడిని చాలా అపురూపంగా చూసుకున్నారు.

ఆ వూళ్ళోని భూస్వాములు దగ్గరినించి, కాసులమ్మ లాంటి సామాన్యమైన మనిషివరకూ, అందరూ తమ శక్తికిమించి అతడికి డబ్బు ముట్టచెప్పారు. ఆ విధంగా ఆ వూరి ప్రజల అనారోగ్యాన్ని, అవుసరాన్ని తన బ్యాంకు అకౌంటుగా మార్చుకుని, దిన దిన ప్రవర్థమానుడై అతి కొద్దికాలంలోనే తనదంటూ ఒక చక్కని చిన్న బంగళాని, దాని ముందొక అందమైన తోటని, అందులో కూర్చుని సాయంత్రం పూట కబుర్లు చెప్పుకోవటానికి సుశీల అనబడే భార్యని అమర్చుకోగలిగాడు దయాసాగర్.

ఇంట్లో బొత్తిగా సందడి లేదని, తను ఇంట్లో లేని సమయంలో భార్యకి తోడుటా వుంటుందని, నగరంనించి ‘ టామి ’ అనే జాతికుక్కని కూడా తెచ్చి పెంచుకోసాగాడు. కానీ ‘ టామీ ’ వచ్చిన వేళావిశేషం వల్ల సుశీల గర్భందాల్చింది. పుట్టిన కుమారుడికి కుమార్ అని నామకరణం చేసాడు, డాక్టర్ దయాసాగర్.

ఆ విధంగా, ఆ ప్రజల అనారోగ్యమే తన అదృష్టంగా వాళ్ళ ఆదరణ – ఆప్యాయతలే తన కవచకుండలాలుగా, వాళ్ళ అమాయకత్వమే తన ప్రయోజకత్వంగా తలుస్తూ, ఆ వూళ్ళో జీవన యాత్ర సాగిస్తున్నాడు డాక్టర్ దయాసాగర్.

ఈ ఎనిమిదేళ్ళ కాలంలో ఆ వూళ్ళో రోగాల సంఖ్యగానీ, డాక్టరు రాబడిగాని, ఆ ప్రజలకి అతడిపై గౌరవాభిమానాలుగానీ ఏవీ తగ్గలేదు. తగ్గిందల్లా కాసులమ్మ లాంటి సగటు మనిషి జీవన ప్రమాణం మాత్రమే !

ఇది ఇలా జరుగుతూవుండగా ఒక రోజు డాక్టర్ ఇక ఇంటికి వెళ్ళిపోదాం అనుకుంటూ వుండగా, సూర్యుడు ఆవూరి పంచాయితీ ఆఫీసు వెనక్కి జారుకుంటూ వుండగా, ఒక చిన్న సంఘటన జరిగింది.

ఆ వూళ్ళో ఈమధ్యనే పిల్లలకోసమని కట్టిన పార్కులో డాక్టర్ కొడుకు కుమార్, కాసులమ్మ కొడుకు మల్లయ్య కల్సి, వారి వారి అంతస్తులు మర్చిపోయి ఉయ్యాల వూగుతుండగా, దాని తాలుకు గొలుసు పట్టు తప్పటంతో, వారిద్దరూ ఎదురుగావున్న సిమెంటు బల్లమీద పడటము– ఇద్దరి తలలు దాదాపు పచ్చడి కావడము, ఒక్క క్షణంలో జరిగిపోయింది.

ఇద్దరికీ వెంటనే స్పృహా తప్పింది.

☆ ☆ ☆

సాగర్ డిస్పెన్సరీ అంతా సర్దేసి, స్టెతస్కోప్‌ని భద్రంగా డ్రాయరులో లాక్ చేసి, ఇంటికి బయలుదేరుతూ వుండగా, బయటినుంచి వినవచ్చిన అల్లరిని ఆలకించి, ‘ మళ్ళీ ఏదో ఎమర్జెన్సీ కేసులా వుంది ’ అని విసుక్కుంటూ కుర్చీలో తిరిగి కూలబడ్డాడు. ఇంతలో కుర్రాడొకడు పరిగెత్తుకుంటూ వచ్చి, “ డాక్టరుగారూ ! మీ అబ్బాయి ....” మాటని మధ్యలోనే మింగేసి, చేతిని బయటికి చూపించాడు.

డాక్టరుకి ముందు ఏమీ అర్థం కాలేదు. కంగారుగా కుర్చీలోంచి లేచి బయటికొచ్చి చూసాడు. – కుమార్‌ని ఎవరో ఒక వ్యక్తి భుజం మీద వేసుకున్నాడు.

డాక్టరులోని తండ్రి ప్రాణం రెపరెపలాడింది. కంగారుగా ‘ ఏమైంది ? ’ అన్నాడు.

జరిగింది జరిగినట్టుగా – సినిమా కథలా సోదాహరణంగా చెప్పటం మొదలెట్టాడు ఆ గుంపులోని ఒక వ్యక్తి.

కానీ, డాక్టరు అవేం వినిపించుకునే స్థితిలోలేదు.

“ ఇలా పడుకోబెట్టండి ! ” కంగారుగా అన్నాడు.

“ మల్లయ్యకి కూడా దెబ్బలు తగిలాయండి ” అన్నాడు ఇంకో వ్యక్తి డాక్టరుతో.

అపుడుగాని డాక్టరు దృష్టి ఇంకోవ్యఇక్త భుజంమీదున్న మరో కుర్రాడిమీద పడలేదు.

అర్థంకాని డాక్టరు చూపుల్ని కనిపెట్టిన ఎవరో అన్నారు, " ఆడు కాసులమ్మ కొడుకండి ! "

" సరే, వాడిని కూడా ఇక్కడ పడుకోబెట్టి మీరందరూ బయటికెళ్ళండి ! " తేరుకున్న సాగర్ ఆజ్ఞ జారీచేసాడు.

అతడు చెప్పినట్టుగానే వారిద్దరిని అక్కడున్న బల్లమీద పడుకోబెట్టి, తగ్గుస్థాయిలో గుసగుసలాడుకుంటూ బయటికెళ్ళి పోయారు జనం.

వారిలోనే ఒక కుర్రాడిచేత తన ఇంటికి కబురంపించి, తలుపు గడియపెట్టి కొడుకువంక చూసాడు డాక్టర్.

కుమార్ నిద్రపోతున్నట్టుగా కళ్ళు మూసుకుని పడుకుని వున్నాడు.

ముఖం అంతా నెత్తురు చారికలతో అసహ్యంగా వుంది. ఖరీదైన అతడి బట్టలు మట్టికొట్టుకుని వెలా లాపోతున్నాయి.

ఆ పరిస్థితిలో కొడుకుని చూసిన సాగర్‌కి ఒక్కసారిగా దు:ఖం పెల్లుబికి వచ్చింది.

రెండు క్షణాలు కళ్ళు మూసుకుని, తనను తానూ సముదాయించుకుని, కళ్ళు తెరచి ప్రక్కనున్న మల్లయ్యవంక చూసాడు సాగర్.

చిరగిపోయిన లాగు – చొక్కా, తైల సంస్కారంలేని జుట్టు, ఎన్నో దినాలుగా తిండిలేనివాడిలా – బలహీనంగా కన్పించాడు.

అలా చూస్తూ నిలబడ్డ డాక్టర్ ఒక్కక్షణం ఇద్దరివంక మార్చి మార్చి చూసాడు. అప్పుడే మల్లిగాడిపట్ల అతడికి ఓ నిర్లక్ష్య భావం ఏర్పడింది.

వెంటనే కర్తవ్యం గుర్తురాగా, స్టౌ అంటించి, ఇంజక్షన్ తాలూకు సామాన్లు వెచ్చ చేయటానికి పడేసి, టించరుతో కొడుకు గాయాలు శుభ్రం చెయ్యటం మొదలెట్టాడు.

ఈ దశలో బయటనించి ఒక ఆడమనిషి – గుండెలవిసేలా, ఎవరో తన ప్రాణాలు లాగేసుకుంటున్నట్లుగా , తన నెత్తురుని ఎవరో బలవంతానా త్రాగేస్తున్నట్లుగా – ఏడ్వటం వినిపించింది.

అది మల్లిగాడి తల్లి కాసులమ్మది.

" బాబు డాక్టరుగోరు ! నా మల్లిగాడిని బతికించుబాబూ ! ఆడే బాబూ నాకు మిగిలింది – నా పానాలు తీసి ఆడికిపొయ్యి బాబూ ! ఆడికేమైనా అయితే నేను బతకలేను బాబూ ! "

కాసులమ్మ చాలా హృదయ విదారకంగా, అనాగరికంగా ఏడవసాగింది.

చాలా దీక్షగా, ఏకాగ్రతతో కొడుకు గాయాల్ని శుభ్రం చేస్తున్న డాక్టరుకి,ఆ మె ఏడుపు కించిత్తు అవరోధం అనిపించి, తల తిప్పి మల్లిగాడివంక చూసాడు.

వాడు నిద్రపోతున్నట్లుగా అలాగే పడుకున్నాడు. బలహీనంగా శ్వాస తీస్తున్నట్లుగా అనిపించింది సాగర్‌కి.

కుమార్ దగ్గర్నించి లేచి విసుగ్గా తలుపు తోసుకుని బయటికొచ్చాడు.

కాసులమ్మ నేలమీద పడుకుని చిన్నపిల్లలా ఏడుస్తోంది,

" చూడమ్మా ! నువ్వు ధైర్యంగా వుండాలి, నా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నా, నువ్విలా ఏడుస్తుంటే లోపల నేనెలా వైద్యం చేసేది " విసుగ్గా అనేసి మళ్ళీ లోపలికెళ్ళి తలుపేసేసుకున్నాడు డాక్టర్

సిరంజి తీసి శుభ్రంచేసి, మందెక్కించి ఇంజోన్ చేసాడు కుమార్‌కి. వెంటనే సిరంజిని మరుగుతున్న నీళ్ళల్లో పడేసి, కొడుకు గాయాల్ని పూర్తిగా శుభ్రంచేసి, బ్యాండేజ్ కట్టడంలో నిమగ్నుడయ్యాడు.

బయట కాసులమ్మ ఏడుపు సన్నగా వినిపిస్తూనే వుంది.

ఇంతలో మళ్ళీ తలుపు చప్పుడైంది.

మళ్లీ విసుక్కుంటూ లేచి తలుపు తీశాడు.

ఆ వచ్చింది అతడి భార్య సుశీల.

" ఏవండీ ! బాబుకెలా వుంది ? ఏం పర్వాలేదుగా ? " ఘోల్లున నాగరికంగా ఏడ్వడం మొదలెట్టింది.

" కంగారుపడకు సుశీ ! ఏం ఫర్వాలేదు..... కానీ రక్తంబాగా పోయింది. వెంటనే రక్తం ఎక్కించాలి. " పరధ్యానంగా సమాధానం చెప్పాడు.

" ఏవండీ ! నా రక్తం తియ్యండి. వాడికెక్కించండి .....వాడిని ఎలాగైనా బతికించండి ! " ఆవేదనతో ఆవేశంగా అంది.

" అవేశపడకు సుశీ ! నీదిగాని, నా రక్తం గాని బాబుకి సరిపోవు. వాడిది, మనది ఒక గ్రూప్ రక్తం కాదు "

సాగర్, డాక్టరు కావటం వల్ల తనది, భార్యది, కుమారుడిది జాతకచక్రాల్లా బ్లడ్‌గ్రూప్ మొదలైన వివరాలలన్నీ రికార్డులు చేసి పెట్టాడు విపులంగా.

" ఇప్పుడెలాగండి ? " దిగులుగా అడిగింది భర్తని.

" అదే ఆలోచిస్తున్నా – నువ్వెళ్ళి గదిలో కూర్చో – ప్లీజ్ ? " వేడుకోలుగా అన్నాడు.

" ఆ అబ్బాయికెలా వుంది ? " మల్లిగాడి వైపు చూస్తూ అంది.

“ అతడికి రక్తం బాగా పోయింది. సీరియస్‌గానే ఉంది ”

సుశీల మరొక్కసారి కొడుకుని తడిమి చూసుకుని బయటికెళ్ళిపోయింది.

ఇక్కడ కాసులమ్మని గూర్చి రెండు మాటలు చెప్పాలి.

కాసులమ్మ ఆ వూళ్ళో కలిగినవాళ్ళ ఇళ్ళల్లో పనిమనిషి. పాచిపని చేస్తుంది, బియ్యం దంచుతుంది, బట్టలుతుకుతుంది – ఇంకా ఎన్నో పనులు చేస్తుంది. ఆమెకి ముందు వెనుక ఎవ్వరూ లేరు – ఒక్క మల్లిగాడు తప్ప.

మొగుడు రాజయ్య తాగుడే తన ధ్యేయంగా పెట్టుకుని, రోజుకి ఇరవైనాలుగ్గంటలు తాగేసి, బతికినన్నాళ్ళు భార్య నేడిపించి, ఓ రోజు కన్ను మూసాడు

పోయేముందు భార్యని పిల్చి కన్నీళ్ళెట్టుకున్నాడు. మల్లయ్యను బాగా చదివించమన్నాడు. వాడికన్నా మంచి భవిష్యత్తు చూపించమన్నాడు. మరణశయ్యపై భర్త కోరిన కోర్కెని తన జీవిత ధ్యేయంగా పెట్టుకుని, కాసులమ్మ అహర్నిశలూ కష్టపడసాగింది. పాచిపన్లేకాదు – పేచీలేని ఏ పనులైనా ఒళ్ళు దాచుకోకుండా చేస్తుంది.

మల్లయ్యని ఈ మధ్యే స్కూల్లో కూడా చేర్చింది. అటువంటి మల్లయ్యకేమైనా అయితే ఆమె జీవించగలదా ? ఎవరి కోసం జీవించాలి ?

ఇవన్నీ తల్చుకుని కాసులమ్మ మల్లయ్య నెలాగైనా బ్రతికించమని కనిపించని దేవుడిని కన్నీళ్ళతో ప్రార్థిస్తోంది.

కానీ లోపల తన కొడుకు గురించి ఆందోళన పడిపోతున్న డాక్టరుకి, ఆమె ఏడుపుతో మతి పోతున్నట్లుగా అనిపిస్తోంది. కుమార్‌కి రక్తం కావాలి – ఆ వూళ్ళో బ్లడ్ బ్యాంకు లేదు, ఎలా ? కానీ ఎలాగైనా నా కుమార్‌ని బ్రతికించుకోవాలి లేకపోతే తను బ్రతగ్గలడా ?

దయాసాగర్‌కి ఏం చెయ్యాలో పాలు పోవటంలేదు. పిచ్చి పట్టిన వాడిలాగా గదిలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఆలోచిస్తున్న డాక్టరుకి మెరుపులాంటి ఆలోచనొచ్చింది. చటుక్కున తలుపు తీసుకుని బయటికొచ్చాడు.

కాసులమ్మ సన్నగా ఏడుస్తూనే వుంది.

ఆమె చుట్టూ జనం నిలబడి వింతగా చూస్తున్నారు.

డాక్టర్ బయటికి రాగానే. అందరూ ప్రక్కలకి తప్పుకున్నారు. అతడు కాసులమ్మతో, “ చూడు – ఏడ్చి ఏం ప్రయోజనం ? ధైర్యంగా వుండాలి. నా చేతిలో వున్నదంతా చేస్తున్నాను. కాకపోతే రక్తం బాగా పోయింది. రక్తం కావాలి – ఇస్తావా ? ”

మెల్లిగా అన్నాడు డాక్టర్ దయాసాగర్.

కాసులమ్మ ఏడ్వటం ఆపి ఆశగా, " నెత్తురేంటి బాబు – నా పానాలయినా ఇత్తానాడికోసం. తీస్కోబాబు – నా నెత్తురంతా తోడేసి –ఆడికెక్కించేసి, బతికించుబాబు ! " కాళ్ళు పట్టుకుని బతిమాలింది దీనంగా.

" సరే అయితే ఇలారా – అసలు నీ రక్తం అతడికి పనికొస్తుందో లేదో ముందు పరీక్ష చెయ్యాలి " అంటూ ప్రక్కగదిలోకి నడిచాడు.

కాసులమ్మ అమాయకంగా పులివెంట మేకలాగా అతడిని అనుసరించింది.

ఆమెని స్టూల్‌మీద కూర్చోబెట్టి సిరంజితో కాస్త నెత్తురు తీసాడు డాక్టర్ దయాసాగర్.

నెత్తురు తీస్తుంటే కాసులమ్మకి బాధకి బదులు చెప్పలేనంత ఆనందంగా వుంది.

డాక్టరు ఆమె నెత్తురును పరీక్షించటంలో నిమగ్నమయ్యాడు.

ప్రక్కనే వుండి అదంతా గమనిస్తున్న సుశీల, " ఏవండీ ! కుమార్ మాటేమిటి ? " అమాయకంగా అడిగింది.

కానీ డాక్టర్ భార్యప్రశ్నకి జవాబుచెప్పే స్థితిలో లేడు. పరీక్షచేసిన కాసేపటికి అతడి మొహంలో కొత్త ఆశలు చిగురించాయి. అనందం పరవళ్ళు తొక్కింది. " నెత్తురు పనికొస్తుంది, ఇస్తావా ? " అడిగాడు మళ్ళీ.

కాసులమ్మ ఆనందంగా చెయ్యి చాపింది.

డాక్టర్ ఏ మాత్రం కాలం వృధా చెయ్యకుండా కాసులమ్మ నెత్తురు తీసేందుకు కావాల్సిన ఏర్పాట్లు చకచకా చేసాడు

భర్త ప్రవర్తన అర్థంకాని సుశీల తెల్లబోయి చూస్తోంది.

నెత్తురు సీసాలో కెక్కటం మొదలైంది !

డాక్టరు పక్క గదిలోకెళ్ళి పిల్లలిద్దర్నీ పరీక్షచేసాడు

మొదటిసారిగా మల్లిగాడి మొహంలోకి తీక్షణంగా చూస్తూ ఆలోచనలో పడ్డాడు.

కాసలుమ్మ మల్లిగాడికని రక్తాన్ని ధానం చేస్తోంది. కానీ తన వుద్దేశ్యం వేరు. తనామెను మభ్యపెట్టాడు. అది అన్యాయం, అక్రమం కదా ? ఆమె ఎవరికోసమైతే రక్తాన్ని ధారపోస్తోందో అది వారికే దక్కాలి – అది ధర్మం. కాని కుమార్ మాటేమిటి ? అసలు మల్లిగాడికి తల్లి రక్తం పనికొస్తుందా ?

వెంటనే ప్రక్కనే వున్న బీరువాలోంచి ఒక ఫైలు బయటికి తీసాడు. రెండు నెలలక్రితం మల్లిగాడికి విషజ్వరం వస్తే, అతడి రక్తాన్ని పరీక్ష చేసిన కాగితాల తాలూకు ఫైలు తీసి చక

చక చకా కాగితాలు తిప్పాడు.  కావలసిన కాగితం కనిపించింది. దీక్షగా చదివాడు దయాసాగర్.

అతడి మొహం మరింత నల్లగా మారింది.

కాసులమ్మది, మల్లిగాడిది ఒకే గ్రూప్ నెత్తురు !

అలానే కూర్చుండి చాలా సేపు ఆలోచించాడు.

డాక్టరుగా ఇక ఆలోచించలేకపోయాడు – తండ్రిగా ఒక నిర్ణయానికొచ్చాడు.

కుర్చీలోంచి లేచి, ఫైలు  మళ్ళీ  భద్రంగా బీరువాలో  పెట్టేసి ప్రక్క గదిలోకెళ్లాడు.

సీసా నిండుగా  రక్తం ఎక్కింది.

మెల్లిగా సరంజామా అంతా సర్దేసి, టించరుతో కాసులమ్మ చేతిని  రుద్దుతూ, “ఎలా వుంది ? ” అన్నాడు.

“‘ నీరసంగుంది బాబు ! ” ఆనందంగా  జవాబిచ్చింది.

“ బయటికెళ్ళి విశ్రాంతి తీసుకో ”

“ ఇంక మల్లిగాడికి ఏమీ ఫర్వాలేదుగదు బాబు ! ” అమాయకంగా అడిగింది.

“ ఏం ఫర్వాలేదు. వెళ్ళి విశ్రాంతి తీసుకో ”

“ నిజంగా నువ్వు దేముడివి బాబు ! బిడ్డపాపలతో నూరేళ్ళు సల్లంగుండాల ” అంటూ నీరసంగా బయటకి నడిచింది.

సుశీల ఆదుర్దాగా భర్తదగ్గరకొచ్చి  “ ఏవండీ ! అబ్బాయికెలా వుంది ? ” అడిగింది.

కానీ అతడేం సమాధానం చెప్పలేదు. ఏమని చెప్పగలడు ?

నెత్తురు నిండిన సీసాతో చటుక్కున ప్రక్కగదిలోకెళ్ళాడు.

తలుపులు మూసుకున్నాయి.

☆ ☆ ☆

బయట కాలసులమ్మ పడుకుని నీరసంగా మూలుగుతోంది. గూడెంలో జనం అంతా అలాగే  ఆమెవద్ద వుండిపోయారు. “ ఇంటికెళ్ళి కాస్త కూడు తినిరా, మల్లిగాడికేం భయంలేదు. డాట్టరు బాబు దేముడిలాంటోడు – పేనాలుపోసి బతికిత్తాడు ”  అన్నాడో వ్యక్తి.

“ నాకొద్దయ్యా ! మల్లయ్యకి తెలివొచ్చి ‘ అమ్మా ’ అంటే నా కడుపు నిండిపోద్ది. డాట్టరు నెత్తురెక్కిస్తున్నాడుగా. కాసేపట్లో తెలివొచ్చుద్ది ! ” నీరసంగా ఆగి ఆగి మాట్లాడుతోంది కాసులమ్మ ఆయాసంతో.

మూసిన తలుపులు ముసుకున్నట్టే వున్నాయి. లోపల ఏం జరుగుతుందో బయట కూర్చున్న కాసులమ్మకిగాని ప్రక్క గదిలోవున్న సుశీలకి గాని తెలీదు.

దాదాపు ముప్పావుగంట తర్వాత తలుపు తీసుకుని డాక్టరు బయటికొచ్చాడు. ఎవ్వరితోనూ మట్లాడక, సరాసరి భార్యవద్దకెళ్ళి, ఆమెతో రెండుక్షణాలు మట్లాడి, మళ్ళీ, ప్రక్కగదిలో కెళ్ళి తలుపేసాడు.

మళ్ళీ పదినిమిషాల్లో తలుపు తెరుచుకుంది.

డాక్టరు కుమార్‌ని భుజంమీద వేసుకుని భార్యవున్న గదిలోకి తీసుకెళ్లాడు గబ గబా.

జనం అంతా వింతగా గమనిస్తున్నారు.

డాక్టరు మళ్ళీ మల్లిగాడున్న గదిలోకెళ్ళి తలుపువేసాడు.

దాదాపు పావుగంట తర్వాత డాక్టరు మళ్ళీ బయటికొచ్చాడు.

ఇప్పుడతను డాక్టరులా లేడు – హంతకుడులా వున్నాడు – తప్పు చేసిన వాడిలాగా తల దించుకున్నాడు – చెప్పరాని విషయాన్ని చెబుతున్న వాడిలాగా మాటలకోసం తడుముకుంటున్నాడు.

అక్కడ నిలబడ్డవారిలో ఒక వయసుమళ్ళిన వ్యక్తిని పిల్చి గొణుగుతున్నట్లుగా అన్నాడు – " నా శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేసాను కానీ, ఫలితం లేకపోయింది మల్లిగాడు చనిపోయాడు. అతడిని తీసికెళ్ళండి " అనేసి భార్య, కొడుకు వున్న గదిలోకెళ్ళిపోయింది.

గదిలో సుశీల కొడుకుని బ్రతికించినందుకు వెయ్యి దేముళ్ళకి దండాలు పెట్టుకుంటోంది.

డాక్టరు మనస్సులోనే కాసులమ్మకి నమస్కారం చేసుకుంటున్నాడు. బయట జరిగింది విన్న కాసులమ్మ భూమ్యాకాశాలు దద్దరిల్లేలా ఆక్రోశిస్తుంది.

ఆమె ధారపోసిన నెత్తురు ఎవరికోసమో ఆమెకి తెలీదు.

ఆమెకి తెలిసిందల్లా, కనిపించని భగవంతుడు తనకి అన్యాయం చేసాడని మాత్రమే !

మనిషి స్వార్థం కోసంరాక్షసుడుగా మారి, సాటి మనిషిని అతినమ్మకంగా, నిర్దయగా మోసం చేసేసి, పెద్ద మనిషిగా చెలామణి అయిపోతుంటే. ఆ సృష్టికర్త ఏం చెయ్యలేడా ? ఇలాంటి వారి విషయంలో అతడుగూడా నిస్సహాయుడా ?

సంఘంలో కేవలం డాక్టరైనంత మాత్రాన, ఒక వున్నత స్థానంలో వున్నంతమాత్రాన, దాన్ని ఆసరాగా తీసుకుని అభంశుభం ఎరుగని కాసులమ్మలాంటి వారిని మోసంచేసే దయాసాగర్ లాంటి వాళ్ళని, జరిగింది తెలీని కాసులమ్మ తన ఖర్మ అని సరిపెట్టుకోవచ్చు. విషయం తెల్సుకున్న సుశీల కొడుకు మీద మమకారం కొద్దీ , భర్తని సమర్థించవచ్చు

కానీ న్యాయాన్యాయాలను అనుక్షణం బేరీజువేసే అతీత శక్తి మాత్రం క్షమించదు.

అందుకే, కుమార్ కాసులమ్మ నెత్తురు  తాగి బతికి బయటపడ్డా, తలపై తగిలిన బలమైన గాయాలవల్ల పిచ్చివాడయ్యాడు.

**------- అయ్యిపోయింది -------**